# 'పూలమనసులు'

## కథాసంపుటి

## నండూరి సుందరీ నాగమణి



**Poola Manasulu** (Stories)
By
**Nandoori Sundari Nagamani**

First Published: October, 2018

© Author

Address:
**Nandoori Sundari Nagamani**
Flat No. 7, Block No. 18,
HIG II, Manasa Enclave,
Baghlingampally, Hyderabad-500 044.
Ph: 98499 89201/98497 42503
nandoorinagamani@gmail.com

Cover Design: Bali

Copies: 500

Price: Rs. 150.00

Published by:
**J.V. Publications**
Hyderabad - 500 029
jyothivalaboju@gmail.com

DTP & Type Setting:
**K. Ravi Prabha**,
Cell: 96666 08835

*Printed at:*
**Karshak Art Printers,**
Vidyanagar, Hyd.44

For Copies
**Jyothivalaboju**
Phone: 80963 10140

All Major Book Shops

# పూలమనసులులో....

1. దేశమాత చల్లని ఒడి, తెలియుము ఒక దేవుని గుడి 11
2. దానము చేసిన తరుగనిది 19
3. ఇచ్చుటలో ఉన్న హాయి 26
4. జ్వాల 33
5. మలగని దీపాలు 46
6. బంటీ – బనానా 55
7. జీవన రాగం 62
8. కందుకము వోలె... 69
9. పూలమనసులు 76
10. (ప్రే)మంటే! 82
11. విముక్త 90
12. ప్రేమించు – ప్రేమ పంచు 94
13. అఖండదీపం 97
14. థాంక్ యూ అభిరామ్! 103
15. పడగ దిగింది 113
16. బెస్ట్ ఫ్రెండ్ 121
17. ఈ కోయిలకు ఋతువు లేదు 129
18. తామరాకు మీద నీటిబొట్టు 142
19. ధర్మో రక్షతి రక్షితః 148
20. 'గోపికమ్మా, చాలునులేమ్మా నీ నిదురా!' 154
21. డిసెంబరు పూలు 159

# దేశమాత చల్లని ఒడి,
# తెలియుము ఒక దేవుని గుడి!

“అరె ధీరూ, ఏం చేస్తున్నావ్‌రా?” ఫోన్‌లో పలకరించిన తరుణ్‌తో “రేపు ఒక కంపెనీలో వాకిన్ ఇంటర్వ్యూ ఉందిరా. ప్రిపేర్ అవుతున్నాను.” జవాబు చెప్పాను.

“ఎందుకురా మామా, ఇక్కడే ఉండటం? ఇప్పటికి పది వాకిన్‌లకి వెళ్లాం ఒక్కటైనా వచ్చిందా? మనం అబ్రాడ్ పోదాంరా. ఐల్స్, జీఆర్ఈ పరీక్ష రాసి క్వాలిఫై అవుదాం. ఏదో ఒక యూనివర్సిటీలో సీట్ వస్తుంది. రెండేళ్ళు కళ్ళు మూసుకుంటే మాస్టర్స్ డిగ్రీ వస్తుంది. ఆపైన అక్కడే మంచి జాబ్ కూడా వచ్చేస్తుంది” ఉత్సాహంగా చెప్పాడు తరుణ్.

“అబ్రాడ్‌కా? వద్దులే మామా! చాలా ఖర్చుతో కూడిన వ్యవహారం కదా! నాకు ఇంట్రెస్ట్ లేదురా” అన్నాను.

“అరె, బ్యాంకులెందుకున్నాయ్‌రా? మన చదువులకి అప్పులివ్వటానికే కదా! ఆంటీవాళ్ళ బ్యాంక్‌లోనే లోన్ తీసుకో. రెండేళ్ళ తర్వాత మనకి అక్కడే ఉద్యోగం

వచ్చేస్తుంది. ఆ అప్పు ఆరు నెలల్లో తీర్చేయవచ్చు. ముందైతే మనం ఐల్స్‌కి అప్లై చేద్దామురా. సాయంత్రం ఇంటికి రా. నా సిస్టంలోంచి అప్లై చేద్దాం."

"అంత దూరం ఎందుకులేరా, ఇక్కడే ఏదైనా మంచి జాబ్ చూసుకోవచ్చు కదా!"

"మా పెద్దమ్మ కూతురు నానీ అక్క తెలుసు కదరా. మూడేళ్ళ క్రితం వెళ్ళింది, చదువైపోయి వెంటనే మంచి జాబ్ కూడా వచ్చేసింది. మనకీ అలాగే అక్కడ మంచి ఉద్యోగాలు వస్తాయిరా. నీకెందుకు, నువ్వు సాయంత్రం వచ్చేయి. నువ్వు అక్కడికి వెళ్లి చదువుకుంటానంటే ఆంటీ, అంకుల్ ఎంత సంతోషపడతారో నాకు తెలుసు కదా!" తరుణ్ మరీ మరీ చెప్పటంతో ఆలోచనలో పడ్డాను.

❖ ❖ ❖ ❖ ❖

జీఆర్ఈ పరీక్ష పాసయ్యాక ఇంట్లో అమ్మకీ, నాన్నకీ చెప్పాను.

"ఒక్కగానొక్క కొడుకువి, అక్కడికి అంత దూరం ఎందుకు నాన్నా? వద్దులే" అంది అమ్మ.

"ఉండటం కష్టం కదా నాన్నా! ఇక్కడే ఏదైనా గవర్నమెంట్ జాబ్ చూసుకో" చెప్పారు నాన్న.

అప్పటికే తరుణ్‌గాడి ప్రభావం నా మీదకి చాలా వచ్చేసింది. నా మనసు అమెరికా వీధుల్లో, ఆకాశహర్మ్యాల మధ్యన, హైవేలో విమానం వంటి పెద్ద కారులో ఊరేగుతోంది. ఎలాగైనా స్టేట్స్ వెళ్లిపోవాలి, త్వరగా డబ్బు సంపాదించి, అమ్మానాన్నలకి ఏ కష్టం కలక్కుండా చూసుకోవాలి. ఇదే ఇప్పుడు నా ప్రథమ కర్తవ్యం అనిపిస్తోంది.

"కష్టమేమీ లేదు నాన్నా, తరుణ్, పవన్ ఇద్దరూ కూడా నాతోనే ఉంటారు కదా! యూనివర్సిటీలకి అప్లై చేస్తున్నాం ఈ రోజు. అమ్మా! కాదనకమ్మా. రెండేళ్ళు ఎంతలో గడుస్తాయి చెప్పు? మధ్యలో ఓసారి వచ్చి వెళ్ళవచ్చు కూడా."

"నీ ఇష్టం నాన్నా! నేనేమీ కాదని అనలేను. ఔననీ అనలేకపోతున్నా." భారంగా నిట్టూర్పు విడిచింది అమ్మ.

యూనివర్సిటీ నుంచి త్వరగానే ఐ ట్వంటీ (చదవదలచుకున్న కోర్స్‌లో సీటు వచ్చినట్టు తెలిపే పత్రం) వచ్చేసింది. దాంట్లోనే రెండేళ్ళ చదువుకూ,

# జ్వాల

**కా**రులో డాక్టర్ వద్దకు వెళ్ళి వచ్చారు సుదీప్, వెన్నెల. భార్య భుజాల చుట్టూ చేయి వేసి, మెల్లగా నడిపిస్తూ ఇంట్లోకి తీసుకువచ్చాడు సుదీప్.

"చూడు విన్నీ, నువ్వు చాలా ఎనిమిక్‌గా ఉన్నావని చెప్పింది డాక్టరు. ఈ పరిస్థితిలో ప్రెగ్నెన్సీ వచ్చింది. చాలా జాగ్రత్తగా ఉండాలి. రెగ్యులర్‌గా మందులూ వాడాలి. సరేనా?"

"సరేనండి. అబ్బా, ఏమిటో కళ్ళు తిరిగిపోతున్నాయి." నీరసంగా సోఫాలో వాలిపోయింది వెన్నెల. వంటమనిషిని పిలిచి హార్లిక్స్ తెమ్మని పురమాయించి, భార్య దగ్గరే కూర్చున్నాడు సుదీప్.

వాళ్ళిద్దరికీ వివాహం జరిగి మూడున్నర నెలలైంది. వెన్నెల అతని జీవితం లోనికి ఎన్నో కోట్ల విలువైన ఆస్తి పాస్తులతో అడుగుపెట్టింది. ప్రేమంటే ఏమిటో తెలియని సుదీప్ మనసులో మొట్టమొదటిసారిగా వెన్నెల అంటే ప్రేమ కలిగింది. ఇప్పుడు తాను తండ్రి కాబోతున్న వార్త తెలిసి అనిర్వచనీయమైన ఆనందానికి లోనయ్యాడు సుదీప్. బుజ్జి పాపాయిని కానుకగా ఇవ్వబోతున్న అర్ధాంగిపట్ల అవ్యాజమైన అనురాగం కలిగిందతడికి.

❖ ❖ ❖ ❖ ❖

ఆ రాత్రి....

ఇంట్లోంచి బయటకు వచ్చేసి, కంగారుగా పరుగు తీయసాగాడు సుదీప్. ఎవ్వరో అతన్ని తరుముకు వస్తున్నారు. భయంతో అతను పరుగుతీస్తూనే ఉన్నాడు. చిమ్మ చీకటి. కుక్కలు అరుస్తున్నాయి. ఆయాసం వచ్చేస్తోంది. వెనక్కి తిరిగి చూడాలంటే వణుకు పుడుతోంది. పరుగుతీస్తూనే ఊరి చివరికి వచ్చేసాడు సుదీప్. కాస్త అలుపు తీర్చుకుందామని కళ్ళు మూసుకుని నిలబడ్డాడు. ముక్కులు పగిలే భయంకరమైన కమురు వాసనకు కడుపులో తిప్పినట్టై కళ్ళు తెరిచి చూసి, కెవ్వున అరిచాడు.

ఎదురుగా మండుతున్న కాష్టం. కాటుకలాంటి కటిక చీకట్లో ఎర్రగా కాలుతోంది. తన చుట్టూ ఎముకలూ, పుర్రెలూ, సమాధులూ. ఇదేంటి, తానిలా స్మశానంలో ఉన్నాడు? చీకట్లో దట్టంగా పెరిగిన చెట్లు జడలు విరబోసుకున్న దయ్యాల్లా ఉన్నాయి. ఉండి ఉండీ నిశ్శబ్దాన్ని చీలుస్తూ నక్కల ఊళలు భయంకరంగా వినిపించసాగాయి. ఉన్నట్టుండి అతని మీద బరువుగా ఏదో పడింది. త్రుళ్ళిపడ్డాడు సుదీప్. అది ఒక పెద్ద వర్షపు చినుకు. క్షణాల్లో ఆ వర్షం కాస్తా జడివానలా మారిపోయి అతన్ని నిలువెల్లా తడిపివేసింది. మండుతున్న చితిలోంచి ఎవరో లేచి తన మీదకు లంఘించినట్టు అనిపించి, మరోసారి గట్టిగా అరిచాడు సుదీప్. అతని సర్వశక్తులనూ ఎవరో హరించివేసినట్టే అనిపిస్తుంటే, దబ్బున నేలమీద పడిపోయాడు నిస్సత్తువగా.

“అయ్యయ్యో, ఇదేమిటి? ఇలా పడిపోయారేమిటండీ?” వెన్నెల కంగారుగా తనను కుదుపుతుంటే, అయోమయంగా కళ్ళు తెరిచి చూసాడు సుదీప్. అతని ఒళ్ళంతా చెమటలతో తడిసి ముద్దయింది. కంగారుగా అత్తగారిని తీసుకువచ్చింది వెన్నెల.

“ఏమైందిరా నాయనా? ఏదైనా పాడు పీడకల గానీ వచ్చిందా?” కొడుక్కి చల్లని ఐస్ వాటర్ తాగిస్తూ వాపోయింది పార్వతమ్మ. తల్లివైపే నీరసంగా చూస్తూ తలూపాడు సుదీప్.

“దేముడిని తలచుకొని పడుకోరా నాన్నా! భయపడకు.” ప్రేమగా చెప్పిందావిడ అతని వెన్ను నిమురుతూ. మళ్ళీ మెల్లగా నిద్రలోకి జారిపోయాడు సుదీప్.

❖ ❖ ❖ ❖ ❖

# పూలమనసులు

"రమణి మేడమ్, మీ జడలో మల్లెపూలు ఎంత బాగున్నాయి? గుప్పెడే అయినా ఇంకా ఫ్రెష్‌గా ఉండి ఒకటే చక్కటి సువాసన వస్తోంది." ప్రశంసించింది భువన నా జడవంక చూస్తూ.

భోజన విరామ సమయం. కొలీగ్స్ అందరం ఒకే దగ్గర చేరి భోజనం చేయటం, ఉన్న అరగంటలో కబుర్లు, కాకరకాయలూ పంచుకొని గబగబా లంచ్ చేసి, మళ్ళీ విధులలో పడటం మాకు అలవాటూ, ఆనవాయితీ.

"నిజం రమణీ! చాలా బాగున్నాయి" అన్నది దుర్గ.

ఆ మాటలు వింటూ ఉంటే నా ముఖం ఉక్రోషంతో పొంగింది. ముఖం ఎర్రగా చేసుకున్నాను.

"రోజు రోజుకీ మనుషుల్లో నిజాయితీ తగ్గిపోతోంది" అన్నాను కొంచెం కోపంగా.

"ఏమైంది?" అన్నారందరూ ఒకేసారి.

"నిన్న మన ఆఫీస్ అయ్యాక పూలు కొనటానికి ఇటువైపు వెళ్ళానా? మన కోఠీ సెంటర్లో వరుసగా అమ్మాయిలంతా పూలు పెట్టుకుని అమ్ముతూ ఉంటారు

కదా! బాగా చీకటి పడిపోయింది. ఈ మల్లెపూలు చూసి, మూర ఎంతో అడిగి, రెండు మూరలు ఇవ్వమని అడిగాను. పదిహేను రూపాయలు ఇచ్చేసాను కూడా. ఈలోగా ఒక యువజంట వచ్చి పూలు బేరమాడుతుంటే నాకు త్వరగా ఇవ్వమని, ఆటో దొరకదనీ నేను అడుగుతూ ఉంటే వెంటనే పూలు కట్ చేసి ప్యాక్ చేసి నాకు ఇచ్చేసింది ఆమె. తీరా ఇంటికి వచ్చి చూసేసరికి ఒక్క మూరే ఉన్నాయి తెలుసా? ఆ కనుచీకట్లో నాకు కనిపించదని మోసం చేసింది. మరీ టూ మచ్ కదా!"

"అయ్యో అవునా? నిజమే టూ మచ్ అండీ" అన్నారు అందరూ కోరస్‌గా.

"మరింకేం, ఈ రోజు వెళ్లి ఆమెను అడుగు" అంది దుర్గ.

"ఛ, ఏం అడుగుతాం దుర్గా! ఒక్క ఎనిమిది రూపాయల కోసం! పోనీలే. పేదామె కదా!" అన్నాను.

"కాదులే, అడిగితేనే మంచిది రమణీ!" అన్నది రమాదేవి.

"ఇవి మూరెడు పూలా? ఇంత తక్కువున్నాయ్?" సందేహం వెలిబుచ్చింది భువన.

"ఓహ్, అదా? మా ఇంట్లో నాకో పోటీదారుంది కదా, అసలు నేను పూలు ఎప్పుడో కాని కొనను. కొన్నా దేవుడికే వేసేస్తాను. నిన్న రాత్రి మా రాక్షసి పేచీ పెట్టింది తనకీ కావాలని. స్కూలుకి ఎలాగూ పెట్టుకోనివ్వరు కదా! అందుకే నిన్న రాత్రి రెండు జడలు వేయించుకుని పూలు పెట్టించుకుంది." నా కూతురిని తలచుకొంటూ నవ్వుకుంటూ చెప్పాను.

లంచ్ ముగియగానే ఎవరి పనుల్లో వాళ్ళు పడ్డాము. ఈలోగానే హోరున వర్షం మొదలైంది. మా కోఠీలో వర్షం వస్తే దుకాణాలు అన్నీ బందే. పాపం పళ్ళు, పూలు, కూరలు అమ్ముకునే హాకర్లు లబో దిబోమంటూ అన్నీ సర్దుకుని వెళ్ళిపోతారు నిస్సహాయంగా. ఏడున్నరకి వర్షంలో తడుస్తూనే ఆఫీసు వాకిట్లో ఆటోని పిలిచి, ఇంటికి బయలుదేరాను.

❖ ❖ ❖ ❖ ❖

మా అపార్ట్‌మెంట్ దగ్గర ఆటో దిగి మెట్లు ఎక్కుతూ ఉంటే వెనకాల నుంచి వాచ్‌మాన్ మల్లేష్ "అమ్మా, మీరు చెత్త పైసలు ఇవ్వలేదు. ఇస్తారా

# అఖండదీపం

"అయ్యో, అలాగా? ఎప్పుడైందిరా? ఉండు, నే వస్తున్నాను." హడావుడిగా బనీను మీద చొక్కా తొడుక్కుంటున్న పరమేశాన్ని చూసి అప్పటికే నిద్ర మేలుకున్న అన్నపూర్ణ "ఏమిటండీ విషయం?" అని అడిగింది.

"పూర్ణా, లలితక్క పోయిందట. వాళ్ళబ్బాయి గోవిందు ఫోన్ చేసాడు. నిన్న మధ్యాహ్నం హాస్పిటల్లో జాయిన్ చేసారట. సాయంత్రం చెప్పాడు. ఇందాకే ప్రాణం పోయిందట" విచారంగా చెప్పాడు పరమేశం.

"అరెరె అవునా? చక్కగా ప్రశాంతంగా నవ్వుతూ ఉండేది. క్రిందటేడాది పెద్దాస్పత్రిలో చేర్పించారు కదా!"

"అవును. గుండెకి పేస్ మేకర్ అమర్చారు. పెద్దవయసు కదా తట్టుకుంటుందో లేదో అని గోవింద్ భయపడ్డాడు కూడా. కానీ ఆపరేషన్ సక్సెస్ అయింది. నిన్న ఉదయం వరకూ బాగానే ఉందిట కూడా."

"అవునండీ. తన పని తను చేసుకునేది, కోడళ్ళ మీద ఆధారపడేది కాదు. అర్ధరాత్రి దాటింది కదా, ఇంటికి తీసుకొచ్చేరా?"

"అవును పూర్ణా, ఇందాకే తీసుకువచ్చారట. వాళ్ళ అమ్మాయిలూ ఈ ఊరిలోనే

ఉన్నారుగా! అందరికీ ఫోన్లు చేసారట అన్నదమ్ములు. కాసేపట్లో అందరూ వచ్చేస్తారు. నేను వెళ్ళి గోవిందుకి ఏర్పాట్లు చేసుకోవటానికి సాయంగా ఉంటాను. పెద్దకొడుకు కదా! తల్లికి బాగా చేరిక. నలభై ఏళ్ళు వచ్చినా ఇతనికి తల్లి అంటే విపరీతమైన మమకారం. అతని తమ్ముడు కొంచెం ఫర్వాలేదు కానీ ఇతనిది చిన్నపిల్లవాడి మనస్తత్వం. నేను వెళతానులే మరి. నువ్వు వీలుంటే ఒక గంటా, రెండు గంటలాగి రా. రాగలవా?"

"అయ్యో! వస్తానండీ, ప్రక్క వీధిలోనే కదా, భయమేముంది?"

చెప్పులు వేసుకుని ఆయన వెళ్ళిపోయాడు.

భర్త వెళ్ళగానే తలుపులు వేసుకుని అలాగే కుర్చీలో కూర్చుని ఉండిపోయింది అన్నపూర్ణ. ఎవరి మరణవార్త విన్నా మనసు పాడైపోతూ ఉంటుంది. అది సహజమే మరి. మనిషికి మృత్యువంటే ఉన్న భయం అలాంటిది. అప్రయత్నంగా కంటినుంచి జారిన కన్నీటిధారను కొంగుతో తుడుచుకొని, గడియారం వంక చూసింది. ఒంటిగంట దాటుతోంది. నీళ్ళగదిలోకి వెళ్ళి, ముఖం కడుక్కుని వచ్చి, దైవధ్యానం చేసుకుంటూ కూర్చుంది. అప్రయత్నంగా లలితమ్మ ఆత్మను తలచుకొని ప్రార్థిస్తూ ఉంటే తనకు తెలియకుండానే కనుల వెంట మళ్ళీ నీరు జాలువారింది.

❖ ❖ ❖ ❖ ❖

అక్కడ వాతావరణం అంతా విషాదమయంగా ఉంది. లలితమ్మ పార్థివ శరీరాన్ని నేలమీద చాప వేసి పడుకోబెట్టారు. తలవైపు దీపం వెలుగుతోంది. అగరుబత్తీలు వెలుగుతున్నాయి. చుట్టుప్రక్కలవారి నిద్రలకు అంతరాయం కలుగకుండా నిశ్శబ్దంగా ఏడుస్తున్నారు ఆమె కొడుకులు, కోడళ్ళు. అంతకు ముందే అక్కడికి చేరుకున్న ఇద్దరు కూతుళ్ళు తల్లినలా నిర్జీవంగా చూస్తూ, వెల్లువలా పొంగివచ్చే దుఃఖాన్ని ఆపుకోలేక వెక్కి వెక్కి ఏడుస్తున్నారు. ఇద్దరు కోడళ్ళూ ఆడబిడ్డలను సముదాయిస్తూ వాళ్ళకి మంచినీళ్ళు తాగిస్తున్నారు. అక్కడే విషాద వదనంతో కూర్చుని ఉన్నాడు పరమేశం.

గోవిందు మనసులో తన చిన్నప్పటి తల్లి రూపం మెదులుతోంది. తనూ, చెల్లాయిలూ, తమ్ముడూ ఆటలు ఆడుకోవటం, వాటిల్లోనూ, చిరుతిళ్ళ దగ్గరా కొట్టుకోవటం, తల్లి వచ్చి సముదాయించటం, ప్రతీ పండక్కీ, పుట్టిన రోజులకీ తమకి ఇష్టమైన పిండివంటలు చేసిపెట్టటం, చిన్నతనంలోనే తమ తండ్రి పోయినా

# పడగ దిగింది

"**కా**రు శుభ్రంగా కడిగేసాను సార్! రేపు సర్వీసింగ్‌కి ఇద్దామంటారా?" ఎంతో వినయంగా అడుగుతున్న చంద్రను చూసి "చూద్దాంలే. వెళ్లి కింద వెయిట్ చెయ్యి. నేను వస్తాను" ముక్తసరిగా అన్నాడు రాజశేఖరం.

చంద్ర మనసు మూగగా రోదించింది. ఇదివరలో రాజశేఖరం తనతో ఎంత ప్రేమగా, ఆప్యాయంగా ఉండేవాడు? తానూ ఇంట్లో పిల్లాడిలా తిరిగేవాడు. రాజ్యలక్ష్మి మేడమ్ తనను స్వంత తమ్ముడిలా చేరదీసి, తన ఆకలి తీర్చేది. అలాంటిది ఇప్పుడు చనువుగా ఆ ఇంట్లోకి వెళ్ళే అర్హతను తనే పోగొట్టుకున్నాడు. కేవలం తన నీచమైన ప్రవర్తన వల్లనే ఇలాంటి పరిణామాలు సంభవించాయి. ఇంకా నయం, ఈయన దయదలచి తన దగ్గర డ్రైవర్‌గా ఉద్యోగం ఇవ్వబట్టి తిండీ, పిల్లల చదువు ఖర్చులూ వెళుతున్నాయి. లేకపోతే ఆత్మహత్యే గతి అయ్యేది తనకు.

మెట్లు దిగి వస్తున్న రాజశేఖరానికి ఎదురు వెళ్లి, అతని చేతిలోని బ్రీఫ్‌కేస్ అందుకొని వెనక సీటులో పెట్టాడు చంద్ర. రాజశేఖరం ఎక్కటానికి వీలుగా వెనక సీటు తలుపు తెరిచి పట్టుకొని, ఆయన ఎక్కగానే తలుపు మూసాడు. తిరిగి వచ్చి డ్రైవింగ్ సీట్‌లో కూర్చుని స్టార్ట్ చేసాడు.

"సార్, ఈ రోజు నా ఎంక్వయిరీ ఫైల్ హెడ్ ఆఫీసువారు చూస్తారట. ప్లీజ్, మీరు తలచుకుంటే నా ఉద్యోగం నాకు మళ్ళీ వస్తుంది. నన్ను పెద్ద మనసుతో క్షమించండి సార్!" వేడికోలుగా అన్నాడు చంద్ర డ్రైవ్ చేస్తూ. రాజశేఖరం నిరసనగా తల తిప్పుకోవటంతో చేసేది లేక నిస్సహాయంగా ఒక నిట్టూర్పు విడిచాడు చంద్ర.

ఆయన్ని ఆఫీసు బయట దింపి, తాను పార్కింగ్ ప్లేసుకి వెళ్ళటానికి కారు స్టార్ట్ చేయబోతూ, ఆఫీసు బిల్డింగ్ వైపు చూసిన చంద్ర కళ్ళలో అప్రయత్నంగా నీళ్ళు నిండాయి. ఆ భవనంలోనే నీడపట్టున ఉండి ఉద్యోగం చేసుకునేవాడు, మళ్ళీ కథ మొదటికి వచ్చినట్టు, ఈ కారు డ్రైవర్ సీట్‌లో సెటిల్ అయ్యాడు. వెనకాల హారన్ మ్రోగటంతో గతం తాలూకు ఆలోచనలు చుట్టుముడుతూ ఉంటే, అన్యమనస్కంగానే ప్రక్కనే ఉన్న పార్కింగ్ ప్లేస్‌కి బయలుదేరాడు.

❖ ❖ ❖ ❖ ❖

"మిస్టర్ రాజశేఖరం, వాగ్దేవి వాళ్ళ ఫైల్ రెడీ అయిందా? మీ రికమండేషన్స్ రాసి పంపండి, నేను మధ్యాహ్నం డివిజనల్ ఆఫీస్‌కి వెళ్లి డిస్కస్ చేయాలి." తలవంచి రాసుకుంటున్న డీజీయం హరినారాయణగారు చెప్పారు.

"అలాగే సార్, అంతా రెడీ అయిపోయింది, టైప్ చేసిన పేపర్స్ ప్రింటవుట్స్ తీసి తీసుకువస్తాను, ఐదు నిమిషాలు" అని లేచాడు రాజశేఖరం.

"నమస్తే సార్, బాగున్నారా?" అప్పుడే అటు వచ్చిన చంద్ర విష్ చేసాడు.

"బాగున్నాను చంద్రా! ఏమిటి, సార్‌ని డీవోకి తీసుకువెళ్ళటానికి వచ్చావా?" నవ్వాడు రాజశేఖరం.

"అవునండీ, అక్కడ మీటింగ్ ఉందట కదా!"

"అవును. బై ది వే, మీ పాప బాగుందా? ఎప్పుడో చిన్నప్పుడు మొదటి పుట్టినరోజుకు చూసాను. ఆ తర్వాత ఊళ్లు తిరగటంతోనే సరిపోయింది. మళ్ళీ మన సార్ దగ్గరికి వచ్చేసాక ఇప్పుడు రిలీఫ్‌గా ఉంది. అప్పట్నుంచీ సార్ దగ్గరే పని చేస్తున్నావు కదూ?" ఆప్యాయంగా అన్నాడు రాజశేఖరం.

"అవునండీ, మీకు తెలుసు కదా, నేను మా వూరు విడిచి ఇరవై ఏళ్ళ వయసులోనే సార్ వాళ్ళ బావగారి దగ్గర డ్రైవర్‌గా చేరాను. ఆ తర్వాత మన

# ధర్మో రక్షతి రక్షితః

రాత్రి పన్నెండున్నర. బహుళ పక్షపు చంద్రుడు ఆలస్యంగా అప్పుడే ఉదయించాడు. పక్కింటి బాల్కనీలో సన్నజాజులు గాలికి రాలుతున్నాయి.

"ఎందుకు నాయనా! మా సహనానికి పరీక్ష పెడతావూ? ఇదిగో ఈ కాగితాల మీద సంతకం చేసేయ్." పెదవులపై విషపునవ్వుతో పెన్నూ కాగితాలూ అందించింది చాముండి. నీరసంగా నిస్సహాయంగా తలెత్తి చూసాడు శౌరి. అతని చేతులు కుర్చీకి కట్టేసి ఉన్నాయి.

"శౌరీ, కమాన్. జస్ట్ చిన్న సంతకం చాలు. తరువాత నీ దారి నీది, నా దారి నాది" విలాసంగా నవ్వుతూ అన్నది రాగిణి. మసక వెలుతురులో ఆడ దయ్యాల్లా ఉన్నారా తల్లీకూతుళ్ళు.

"ఎందుకు రాగిణీ నామీద మీకింత కక్ష?" బాధతో, ఆక్రోశంతో అన్నాడు శౌరి.

"దీన్ని కక్ష అనరు శౌరీ, స్వార్థం అంటారు. నువ్వు సైన్ చేసేస్తే బెటర్. లేకపోతే తెలుసుగా ఆ ఆయుధాన్ని ఉపయోగించాల్సి వస్తుంది."

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/book/Pula+Manasulu+Nandoori+Sundari+Nagamani**

* * *